రాముని విలువల ప్రయాణం...రామాయణం

రామకథ వింటే మనసు ఉప్పొంగిపోతుంది. రామనామం తలిస్తేచాలు తనువు పులకిస్తుంది. పెద్దలంటే వినయం, గురువులంటే భక్తి, తల్లిదండ్రులపై గౌరవం. ఇవన్నీ రాముడికి పుట్టుకతో వచ్చాయి. ఇన్ని సుగుణాలను ఒంటబట్టుకోబట్టే రాముడు సకలగుణాభిరాముడయ్యాడు. ఆదర్శప్రాయుడయ్యాడు. రాముడు పుట్టిపెరిగింది అయోధ్యలోనే కావచ్చు. కానీ రాముడు ఆచరించిచూపిన ధర్మం ప్రాంతాన్ని, ప్రదేశాన్నిబట్టి మారదు. రాముడికథ త్రేతాయుగంలోది కావచ్చు. కానీ ఈనాటికీ పనికివచ్చే ధర్మాన్ని రామాయణంద్వారా మనం పొందుతున్నాం. ధర్మమంటే రాముడు. రాముడంటే ధర్మం. ఇదే రామమార్గం.

రామనగర్, రామాపూర్, శ్రీరామా కాలనీ ఇలా ఊరిపేర్లు, వీధిపేర్లు అన్నీ రామమయమే. ఊరు ఊరుకు, వీధివీధికో రామాలయం. రామయ్య, రామచంద్ర, రామ్, రామారావ్ ఇవన్ని తరతరాలుగా తల్లిదండ్రులు తమకు పుట్టే పిల్లలకు పెట్టుకునే పేర్లు. ఈ పేర్లతో ప్రతి ఇంటిలో రాముడే. రామాయణకాలం దాటి ఇన్ని వేలసంవత్సరాలు గడుస్తున్నప్పటికి రాముడు మననుండి దూరం కాలేదు...కాబోదు.

శ్లో॥ యావత్ స్థాస్యతి గిరయ: సరితశ్చ మహీతలే।

తావద్రామాయణ గాథా లోకేషు ప్రచరిష్యతి॥ (వాల్మీకి రామాయణం)

ఎప్పటిదాకా ఈ భూమిమీద పర్వతాలు, సముద్రాలు నిలచి ఉంటాయో, అంతదాకా లోకంలో రామాయణ కథ ప్రచారంలో ఉంటూనే ఉంటుంది. ఇది వాల్మీకి మాట!

'దశరథుని కొడుకు' అన్న ఒకకారణంతోనే రాముడు అయోధ్యకు రాజు కాలేదు. "బలవాన్, ధృతిమాన్, స్థైర్యవాన్, నాలస:, నిస్తంద్రీ, అప్రమత్త:, జితక్రోధ:" రాముడు బలవంతుడు, ధైర్యవంతుడు, నిలకడ ఉన్నవాడు, సోమరితనం లేనివాడు, ఎమరుపాటు లేనివాడు, కోపాన్ని జయించినవాడు అంటూ వర్ణించాడు వాల్మికి. ఈ లక్షణాలే రామున్ని సార్వభౌమునిగా చేశాయి.



రాజ్యపాలనను నిస్వార్థంగా, ఏకాగ్రచిత్తంతో కొనసాగించాడు రాముడు. ఎక్కడున్నా, ఏంచేస్తున్నా ప్రజలచుట్టే ఆయన అలోచనలు. అందుకే రాముడి పాలనలో ఎక్కడా కరువు, కాటకాలు, దోపిడీ, దొంగతనాలు లేవు. ఆనాటి రామరాజ్యాన్ని ఈనాటికీ కలగంటున్నాం. "రామోరాజ్యముపాసిత్వా" రాముడు రాజ్యాన్ని పాలించలేదు. ఋషులు ఏకాగ్రచిత్తంతో తపస్సు చేసినట్లుగా రాజ్యపాలనను ఒక ఉపాసనగా, దీక్షగా చేపట్టాడు. రావణుడి మరణానంతరం లంకా నగరాన్ని పాలించే అవకాశమున్నప్పటికి, పుట్టిన అయోధ్యే తనకు గొప్పదని సున్నితంగా తిరస్కరించాడు.


ధర్మబద్ధంగా విభీషణున్ని రాజుగా చేశాడు. మరి అలాంటి పాలకున్ని ఏ ప్రజలైనా ఎలా మరచిపోతారు. అందుకే జైశ్రీరామ్...జైజైశ్రీరామ్ అంటూ ఈనాటికీ ప్రజల పలకరింపులు కొనసాగుతున్నాయి.

తండ్రికిచ్చిన మాట ప్రకారం పితృవాక్య పరిపాలనకంటే రాజ్యం ఎక్కువ కాదంటూ అడవులకు బయలుదేరిన రామున్ని ప్రేమావేశంతో ప్రజలంతా అనుసరించారు. అందరు ఆయనవెంట వెళ్ళిపోతే నగరంలో ఉండేది ఎవరు? పాలన అస్తవ్యస్తమైపోదు? వెనక్కి వెళ్ళి పిల్లాపాపలతో సుఖంగా ఉండమని కోరాడు. కానీ రాముని ఎడబాటును ఎవరు కోరుకుంటారు? దాంతో వారికి తెలియకుండా నిద్రలో ఉన్న సమయంచూచి వారిని విడిచిపెట్టి అడవులకు వెళ్ళవలసి వచ్చింది. ఇది రాముడిపై ప్రజలకుండే అభిమానానికి నిదర్శనం.



ఒక్కసారి రాముడిని చూసినవారు, రాముడితో మాట్లాడినవారు ఇక జీవితాంతం మరచిపోరు. అందుకు అయన ముగ్ధమనోహర దివ్యరూపం ఒక కారణమైతే, ఆయన స్వభావం మరో కారణం. రాముడు ఏదైనా మాట్లాడానికి ముందు చిరునవ్వు నవ్వేవాడట. అందుకే రాముడు "స్మితపూర్వభాషి". వినేందుకు సొంపుగా మృదుమధురంగా అందరిని తనే ముందుగా పలకరించేవాడట. రామాయణంలో రాముని గుణాల గురించి వర్ణిస్తు "నచానృత:కథ:, నిభృత:, నిత్యం ప్రశంతాత్మా" అంటే "అబద్ధాలంటే తెలియనివాడు, అణుకువగా ఉండేవాడు, ఎప్పుడూ ప్రశాంతమైన మనసుతో ఉండేవాడు" అని చెప్పబడింది. ఒకవ్యక్తిని అభిమానించడానికి, ఆరాధించడానికి ఇంతకన్నా ఇంకా ఏ గుణాలు ఉండాలి? అందుకే హనుమంతుడితో సహా మునిజనులంతా రాముని సాన్నిధ్యాన్ని కోరుకున్నారు.

బంధాల విలువ రాముడికి తెలిసినట్లుగా ఎవ్వరికి తెలియదేమో! రామకథను పరశీలిస్తే ఆయన బంధాలకు ఎంత విలువ ఇచ్చాడో మనకు కనపడుతుంది. సీతా స్వయంవరంలో గురువుల ఆజ్ఞతో శివధనుస్సు విరిచినా, అనంతరం తండ్రి అనుమతితోనే సీతను పరిణయమాడాడు. ఆయనకు ఎన్నిపేర్లున్నా "దాశరథీ" అని పిలిపించుకునేందుకు ఇష్టపడతాడు. తనతల్లిపై ఎంతప్రేమో మిగతా ఇద్దరిపై అంతే ప్రేమ. తేడాలేదు. అరణ్యవాసంలో ఉన్న రాముడి దగ్గరికి వచ్చిన భరతుడికి "అమ్మ కైకేయిని జాగ్రత్తగా చూసుకో. తేడావస్తే నామీద ఆన" అంటూ గట్టిగా చెప్పాడు. ఇక సీత గురించి "ప్రాణేభ్యోపి గరీయసీ... తనప్రాణంకన్నా ఎక్కువ" అని ప్రకటించాడు రాముడు. తమ్ముల విషయంలో తండ్రిలా వ్యవహరించాడు. ఒక సందర్భంలో సీతకు లక్ష్మణుడు తన ఆత్మ లాంటివాడని, భరత శత్రుఘ్నులు ప్రాణంతో సమానమని వాళ్ళను బిడ్డల్లాగా చూసుకోమని చెబుతాడు.



శ్లో॥ భ్రాతృపుత్రసమౌచాపి ద్రష్టవ్యౌ చ విశేషత:।
త్వయా భరత శత్రుఘ్నౌ ప్రాణై: ప్రియతరౌ మమ॥ (వాల్మీకి రామాయణం)

అందుకే రాముడు అనుబంధానికి నిర్వచనంలా మారాడంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు.

రావణాసురుడిని వధించి అయోధ్యకు తిరిగి వస్తున్న సందర్భంలో హనుమంతుణ్ని పిలచి రాముడు ఒకమాట చెబుతాడు. "ఓ హనుమా! భరతునికి రాజ్యపాలనపై ఆశ ఉన్నట్లయితే తనని బాధపెట్టడం నాకిష్టంలేదు. నువ్వు వెంటనేవెళ్ళి నేను రావణుడినిచంపి సీతను వెంటపెట్టుకొని అయోధ్యకు తిరిగివస్తున్న విషయాన్ని భరతునికి చెప్పు. నీమాటలు వింటున్నప్పుడు భరతుడి ముఖకవళికలను జాగ్రత్తగా గమనించు. ఏమాత్రం బాధపడ్డట్టు కనపడ్డా నేను అయోధ్యకు పోను" అంటాడు. రాముడికి పదవీవ్యామోహం లేదని నిరూపిస్తుందీ ఘట్టం.

రామరావణ యుద్ధం జరుగుతున్నప్పుడు రెండువైపులా సైన్యాలు ఎదురెదురుగా నిలబడ్డాయి. రావణుడి సైన్యమంతా సుశిక్షితులు. వారి చేతిలో పదునైన ఆయుధాలు. ఇక రాముడి వెనకనున్న సైన్యమేమో వానరసైన్యం. ప్రకృతి ప్రసాదించిన చెట్లు, పర్వతాలే వారి ఆయుధాలు. కానీ రావణుడి వైపు లేనిది, రాముడివైపు ఉన్నది ఒకటుంది. అదే....ధర్మం. ధర్మం ఉన్నచోటే విజయం ఉంటుంది. రాముడి మార్గం ధర్మమార్గం. ఎక్కడైనా, ఎప్పుడైనా అంతిమంగా గెలిచేది ధర్మమే. రాముడు ఎక్కడా నీతి తప్పలేదు. ధర్మాన్ని విడువలేదు. అందుకే రాముడు విజేత అయ్యాడు. ఇదంతా నా ఒక్కడి ఘనతేనని చెప్పలేదు. అందరి సహకారంతోనే గెలిచానన్నాడు. ఇదీ రాముడు తనవెంట ఉన్నవారిని గౌరవించే పద్ధతి.




ప్రత్యర్థులను బేరీజు వేయడంలో రాముడు ఎంతో నిజాయితీ చూపాడు. బద్ధశత్రువైనా సరే.....రావణుడి గురించి ఎప్పుడు తప్పుగా మాట్లాడలేదు. "అహోదీప్త మహాతేజా రావణో రాక్షసేశ్వర:" అంటూ అతని తేజస్సును ప్రశంసిస్తు "సీతను అపహరణ చేయకుండా ఉండి ఉన్నట్లయితే ఇతను దేవలోకంలో ఇంద్రపదవిని అధిష్ఠించి ఉండేవాడు" అంటాడు. అసలు రాముడు యుద్ధం చేసిందే ధర్మాన్ని గెలిపించడానికి. శత్రువులను గెలవాలనే కోరికే ఆయనకు లేదు. రాముడు తలచుకుంటే భూమండలంలోని రాజులందరిని ఓడించగలవాడే. ఇదేవిషయం రామాయణంలో ఒకచోట చెప్పబడింది.

శ్లో॥ పిశాచాన్ దనవాన్ యక్షాన్ పృథివ్యాం చైవ రాక్షసాన్।
అంగుల్యగ్రేణ తాన్ హణ్యామిచ్ఛన్ హరిగణేశ్వర॥ (వాల్మీకి రామాయణం)

ఓ సుగ్రీవా! నేను కోరుకుంటే ఈ భూమండంలంలో పిశాచ , దానవ, యక్ష, రాక్షసులనందరిని గోటి కొనభాగంతో అంతం చేయగలను. కానీ అధర్మ మార్గంలో వచ్చేటువంటి ఇంద్రపదవైనా నాకు గడ్డి పరకతో సమానం అంటాడు రాముడు.

ఒకటే బాణం, ఒకటే మాట. "రామోద్విర్నాభిభాషతే" రాముడికి రెండు గొంతుకల్లేవు. ముందొకటి, వెనుకొకటి మాట్లాడే అలవాటూ లేదు. చెప్పిందే చేస్తాడు, చేసేదే చెబుతాడు. చేసిన సహాయానికి కృతజ్ఞతగా ఉండటంకూడా మనం రాముడిని చూసి నేర్చుకోవలసిందే. రావణుని చేతిలో గాయపడిన జటాయువునుచూసి హృదయానికి హత్తుకుని బాధ పడుతాడు. సీతజాడ తెలుసుకొని వచ్చిన హనుమంతున్ని ప్రేమతో ఆలింగనం చేసుకుని కృతజ్ఞతాభావం ఎంత ఆదర్శమైందో మనకు చూపిస్తాడు శ్రీరాముడు.

రామాయణంపై ఇప్పటిదాకా వేయికిపైగా వివిధ భాషలలో రచనలు చేశారు కవులు. వీరందరికి రామాయణంపై ఎందుకింత ఆసక్తి....రామకథ అంటే ఎందుకింత ప్రేమ...? అంటే రాముడివంటి గొప్పనాయకుడు ఎక్కడ దొరుకుతాడు? అటువంటి వ్యక్తిత్వం కలిగినవారి గురించి వివరించినప్పుడే జన్మసార్థకమవుతుంది.



పెరిగేపిల్లలకు పెద్దలను ఎలా గౌరవించాలో నేర్పుతుంది రామాయణం.

వృత్తి, ఉద్యోగ ధర్మాలతో డోలాయమానంలో ఉన్నవారికి పరిష్కారం రామాయణం.

దాంపత్యజీవనానికి సంబంధించి అనురాగ వాచకం రామాయణం.

సమాజంలో సంక్షోభాలకు, సమస్యలకు సమాధానం రామాయణం.

×××××××



వ్యాసరచన

అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని

వేదపండితులు

గ్రా. అచ్చులాపూర్, మం. తాండూర్,

జి. మంచిర్యాల, తెలంగాణ, పిన్: 504273

సెల్: 9440951366

మా ముద్రిత గ్రంథములు:

1. జాతక కళానిధి,
2. ఆశ్వలాయన ఆపస్తమ్బీయ ఉపాకర్మ ప్రయోగం,
3. శ్రీశివపార్వతీ కళ్యాణ మహోత్సవం,
4. గోదావరీ పుష్కర ప్రయోగం
5. కృష్ణా పుష్కర ప్రయోగం